సమావేశంలో మాట్లాడుతున్న సట్ల రవి

కాంగ్రెసోళ్లకు ముందుంది ముసళ్ల పండుగ

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి

చిట్యాల(టేకుమట్ల), జనవరి 26 : గ్రామసభల్లో వెల్లివెత్తిన ప్రశ్నలకు కాంగ్రెసోల్లకు సమాధానం చెప్పే సత్తా లేదని, అడిగితే పత్తా లేకుండా పోతున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. కాంగ్రెసోల్లకు ఇక ముందుంది ముసళ్ల పండగ అని విమర్శించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలులో చెప్పేదొకటి అమలు చేసేది ఇంకోటి అని, నిజమైన నిరుపేదలకు అందని ద్రాక్షలాగే కాంగ్రెస్ పథకాలు ఉంటున్నాయని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మల స్వామి, లక్ష్మణ్, గువ్వాడ మహేశ్, బొడ్డు సదన్న, ఆకునూరు తిరుపతి, భాగ్యలక్ష్మి, ఆది రఘు, బందెల నరేశ్, ఉమేందరావు, పోతనవేన ఐలయ్య, ఎండీ అష్టల్, లింగారెడ్డి, ఉద్దమారి మహేశ్, శివ, పొన్నం చంద్రయ్య పాల్గొన్నారు.

కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ఈవోపై బదిలీ వేటు

మహదేవపూర్, జనవరి 26: మహదేవపూర్ మండలంలోనికాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ఈవో పైబదిలీ వేటు పడింది. ఇటీవల ఆలయ గర్భగుడిలో సింగర్ మధు ప్రియ అనుమతి లేకుండా పాట చిత్రీకరణపై భక్తులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోనళ చేపట్టగా, స్పందించిన దేవా దాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఈవో మారుతీపై బదిలీ చేశారు. ఆయనను కాళేశ్వర ఆలయ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కాగా నూతన ఈవోగా కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆల య ఈవో మహేశ్ బదిలీపై రానున్నట్లు సమాచారం.

దుర్గమ్మ గుడికి రూ.లక్ష విరాళం

ములుగురూరల్, జనవరి26 : మల్లంపల్లి మండలంలోని రామ చంద్రాపురం గ్రామంలో దుర్గమ్మ గుడికి రూ.లక్ష విరాళాలన్ని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అందజేశారు. ఈ మేరకు ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ బృందం ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు గోవింద్‌నాయక్, తాడూరి రఘు, విజయ్‌పాల్‌రెడ్డి, ఓరుగంటి రాజమౌళి, హట్కర్ రూప్‌సింగ్‌కల్పన, వేములపల్లి అశోక్, భూక్య దేవిలాల్, అజ్మీరా సమ్మయ్య, బానోతు రాజునాయక్, రామ్‌రెడ్డి, భూక్య సీతులాల్, పాడియా సుమన్, రాజు, రాజేశ్, దుర్గమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ములుగురూరల్, జనవరి26 : మల్లంపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల మెట్టుపల్లి సుదర్శన్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, మల్లంపల్లిలో కందుగుల రవి అనే జీపీ సిబ్బంది చనిపోగా ఇరువురి కుటుంబాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, గజ్జి నగేశ్, కవ్వంపల్లి బాబు, మహమ్మద్ అంకూస్, ఓరుగంటి లింగమూర్తి, రాజమౌళి, రూస్‌సింగ్, చాంద్ పాష, వేములపల్లి అశోక్, రాజబాబు, మాచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

కొత్తపల్లి ప్లాంటేషన్‌ను పరిశీలించిన పీసీసీఎఫ్ సువర్ణ

కొత్తపల్లిలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

కాటారం, జనవరి 26 : మండలంలోని కొత్తపల్లి వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 60 హెక్టార్ల ప్లాంటేషన్‌ను కంపా(సీఏఎంపీఏ) ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ ఆదివారం పరిశీలించారు. కాళేశ్వరం సీసీఎఫ్ డాక్టర్ ప్రభాకర్‌తో కలిసి ప్లాంటేషన్‌లోని మొక్కలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్లాంటేషన్ నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ప్లాంటేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. అనంతరం ప్లాంటేషన్‌లో అధికారులతో కలిసి మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం ముక్తీవనంను పరిశీలించిన పీసీసీఎఫ్..

మహదేవపూర్(కాళేశ్వరం),జనవరి 26 : మండల పరిధిలోని కాళేశ్వరంలో ఉన్న ముక్తీవనాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)డాక్టర్ సువర్ణ, సీసీఎఫ్ డాక్టర్ బీ.ప్రభాకర్, అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వనంలో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాంగణంలో మొక్క నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రవి, ఎఫ్ఎస్‌వో ఆనంద్, ముక్తీవనం ఎఫ్ఎస్‌వో తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సుభాష్ కాలనీలో లట్ట సాయి ప్రసన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

కృష్ణ కాలనీ, జనవరి 26 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సుభాష్ కాలనీకి చెందిన మాజీ జడ్పీటీసీ లట్ట రాజ బాబు సోదరుడు లట్ట శ్రీనివాస్ కుమార్తె లట్ట సాయి ప్రసన్న అనారోగ్యంతో బాధ పడుతూ ఇటీవల మృతి చెందగా ఆదివారం మృతురాలు కుటుంబ సభ్యులను, 24వ వార్డు కార్తమార్క్ కాలనీ మాజీ బీఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు సూర తిరుపతి సతీమణి సూర లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసిన నివాళులర్పించారు. 5వ వార్డు యాదవ కాలనీకి చెందిన జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా సేవలందించిన కొండ్ర జయంత్ ఇటీవల ప్రమాదపు శాత్తు కిందపడి కాలికి శస్త్ర చికిత్స చేపించుకొని ఇంటివద్ద కోలుకుంటుండగా జయంత్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీసిద్ధూ, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్‌పటేల్, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ నూనె రాజు, కౌన్సిలర్లు ముంజంపల్లి మురళీధర్, కొత్త హరిబాబు, యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, నాయకులు బిబి చారి, శ్రీరామ్, ప్రవీణ్, శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల వీడ్కోలు సమావేశాన్ని విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్

కృష్ణ కాలనీ, జనవరి 26 : భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్ సభ్యుల ఐదేళ్ల పదవీకాలం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు (సోమవారం) బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వీడ్కోలు (సన్మాన) కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వీడ్కోలు వేడుకకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పదవి విరమణ పొందుతున్న కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లను ఘనంగా శాలువాలతో సన్మానిస్తారన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా, అర్బన్ పార్టీ నాయకులు, వార్డ్ ప్రెసిడెంట్స్, యువజన, మహిళా, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ సెల్ నాయకులు, జాగృతి, టీబీజీకేఎస్ నాయకులు, కార్మిక సోదరులు , అన్ని వార్డులకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జనార్దన్ పటేల్ పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగం

మొగుళ్లపల్లి, జనవరి 26 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన పథకాలను ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందజేస్తామని, లేనిపక్షంలో పంచాయతీ ఎన్నికల్లో ప్రజల దగ్గరికి వెళ్లి ఓట్లు అడగమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డ్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణర రావు అందజేశారు. గ్రామాల మౌలిక వసతుల కోసం పెద్ద ఎత్తున నిధులు నియోజకవర్గానికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సునీత, తహసిల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్ ,చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, చైర్మన్ సంపల్లి నర్సింగారావు, ఏపో సురేందర్ రెడ్డి తక్కళ్ళపల్లి రాజు,మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ

కన్నాయిగూడెం, జనవరి 26 : మండలంలోని కంతనపల్లి జీపీలో ఆదివారం ప్రభుత్వం అందించే పథకాలపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ ఆధ్వర్యంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అనిత, ఎంపీవో సాజిదాభేగం పాల్గొని కొత్తగా వచ్చిన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. రేషన్‌కార్డులు 61, ఇందిరమ్మ ఇండ్లు 115, రైతు భరోసా 310, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 33 వచ్చినట్లు తెలిపారు.

ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్సై రేఖ అశోక్

అవార్డు అందుకుంటున్న ఎస్సై రేఖ అశోక్

గణపురం, జనవరి 26 : పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న రేఖ అశోక్ ఆదివారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే చేతులు మీదుగా అవార్డు అందుకున్నాడు. 76వ గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. మండలంలో శాంతి భద్రతలను కాపాడుతూ గంజాయి, గుడుంబాపై ఉక్కు పాదం మోపినందుకు గుర్తించి ఉత్తమ ఎస్ఐగా అవార్డు అందించారు.

యువతి ఆత్మహత్య

ఏటూరునాగారం, జనవరి 26 : వెంకటాపురం మండలం వీరభద్రావరం గ్రామానికి చెందిన సోయం మల్లీశ్వరీ(18) అనే యువతి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై తాజుద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లీశ్వరీకి తల్లిదండ్రులు లేకపోవడంతో పెద్దనాన్న, పెద్దమ్మల ఇంటి వద్ద ఉంటుంది. ప్రతీరోజు తరచూ తెల్లం వరుణ్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడడం గమనించిన మల్లీశ్వరీ పెద్దమ్మ ఎందుకు మాట్లాడుతున్నావంటూ మందలించింది. దీంతో ఈనెల 23న ఏటూరునాగారానికి వచ్చి ఐటీడీఏ మూల మలుపు వద్ద పురుగు మందు తాగి పడిపోవడంతో స్థానికులు వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మెరుగైన చికిత్స కోసం 23వ తేదీన ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురాలి పెద్దనాన్న చంటిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

రంజిత్(ఫైల్)

ఏటూరునాగారం, జనవరి 26 : మండల కేంద్రంలోని ఆకులవారిఘనపూర్‌లో గంజి రంజిత్(32) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రంజిత్ భార్య స్వాతి రెండేళ్ల క్రితం గొడవ పెట్టుకుని పినపాకలోని తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన రంజిత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడు పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై తాజుద్దిన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

వాజేడు, జనవరి 26 : రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఒకరు మృతి చెందినట్లు వాజేడు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు.. వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన తాటి కుటుంబరావు(57) శనివారం రాత్రి వాజేడు మండలంలోని మొరుమూరు గ్రామానికి టీవీఎస్ ఎక్సల్ బైక్‌పై వెళ్లాడు. తిరిగి బర్లగూడెంకు వస్తుండగా ప్రగళ్లపల్లి గ్రామశివారులో వెంకటాపురం మండలం ఉప్పేడు వీరపురానికి చెందిన దుర్గం అప్పారావు ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో కుటుంబరావు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రవమైంది. 108లో వెంకటాపురం ప్రభుత్వ వైద్యాశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపాడు.

బొలెరో వాహనం ఢీకొని కౌన్సిలర్, కో-ఆప్షన్ మెంబర్‌కు గాయాలు

భూపాలపల్లి రూరల్, జనవరి 26 : బొలెరో వాహనం ఢీకొని కౌన్సిలర్, కో-ఆప్షన్ మెంబర్‌కు గాయాలైన ఘటన భూపాలపల్లి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. మంజూర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్ చల్ల రేణుక, కో-ఆప్షన్ మెంబర్ నెరమట్ల కమల హాజరయ్యారు. భూపాలపల్లి పట్టణానికి స్కూటీ పై తిరిగి వస్తున్న క్రమంలో కేటీకే-5 ఇంక్లైన్ కమాన్ వద్ద స్కూటీని బొలెరో వాహనం ఢీకొట్టింది. వారికి గాయాలు కావడంతో పట్టణంలోని కిరణ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు.

పాఠశాలకు రూ.60వేల టీవీ బహూకరణ

ములుగురూరల్, జనవరి 26 : ములుగు మండలంలోని అబ్బాపురం ప్రభుత్వ పాఠశాలకు హనుమకొండ జిల్లా నడికుడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన శ్రీకాంత్-మాధవి దంపతులు రూ.60వేల టీవీని బహూకరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన వారు పాశాలకు టీవీని అందించగా వారిని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. అనంతరం పాఠశాలకు మైక్ సెట్ లేదని తెలుసుకున్న వారు రూ.16వేలను త్వరలో అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజడే

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెన్షన్ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి వీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పనిడి మార్కెట్‌ను శాసిస్తున